సాక్షి
సూర్యాపేట
శుక్రవారం, 9, జూన్, 2023



ఏసీబీ వలలో..
కాంట్రాక్టర్‌కు పనులు అగ్రిమెంట్ చేసేందుకు లంచం తీసుకుంటూ ఇద్దరు విద్యుత్ అధికారులు ఏసీబీకి చిక్కారు. - 8లో



మట్టపల్లిలో కల్యాణం
మట్టపల్లి ఆలయంలో స్వాతినక్షత్ర కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. - 10లో

గరిష్టం/కనిష్టం
44°/28°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉద్యోగోన్నతి.. బాధ్యతను పెంచుతుంది

సూర్యాపేటక్రైం : ఉద్యోగ నిర్వహణలో ప్రమోషన్ పొందడం మరింత బాధ్యతను పెంచుతుందని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, రమేష్, ఆంజనేయులు, అంజి రెడ్డి, సీతారాములు, రాంబాబు, నరేష్, లింగా నాయక్, నరేందర్‌లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా వారికి ఎస్పీ ఉత్తర్వులు అందజేసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రమోషన్ పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. అంచనాలకు అనుగుణంగా క్రమశిక్షణతో పని చేసి తోటి వారికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాంచందర్ గౌడ్, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ అడ్మిన్ ఆర్ఐ శ్రీనివాస్ రావు ఉన్నారు.

10, 11 తేదీల్లో చెస్ పోటీలు

సూర్యాపేటటౌన్ : ఈ నెల 10, 11 తేదీల్లో జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర సీనియర్ ఉమెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్.సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు ఆసక్తి గల వారు ఉదయం 10గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన వారిలో నుంచి నలుగురిని గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగే నేషనల్ టోర్నమెంట్‌కు పంపిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రాష్ట్రంలోని చెస్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ నంబర్ 8555008996ను సంప్రదించాలని సూచించారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈఓ జానపాటి కృష్ణయ్య

సూర్యాపేటటౌన్ : ఈ నెల 12వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జానపాటి కృష్ణయ్య సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఐఈఓ కార్యాలయంలో సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సీఎస్, డీఓ, స్క్వాడ్‌లతో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల కోసం జిల్లాలో 22 సెంటర్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈసీ మెంబర్స్ రుద్రంగి రవి, లక్ష్మయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పెరుమాళ్ల యాదయ్య పాల్గొన్నారు.

ఆహార భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

సూర్యాపేట : ఆహార భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటాచలం అన్నారు. గురువారం వరల్డ్ ఫుడ్ సేఫ్టీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచి ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందన్నారు. జిల్లా ఆహార భద్రత, ప్రత్యేక తనిఖీ అధికారి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఆహార పదార్థాలను కల్తీ చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా వారు తీసుకునే ఆహారం ఎలాంటిదో తెలుసుకోగలగాలన్నారు. సమావేశంలో డాక్టర్ వెంకటరమణ, అంజయ్య, సాంబశివ రావు, సైదులు , ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు , తదితరులు పాల్గొన్నారు.

నేడు గొర్రెల యూనిట్ల పంపిణీ

నకిరేకల్ : గొర్రెల యూనిట్ల పంపిణీకి రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శుక్రవారం నకిరేకల్ వస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక మినీ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలుత నకిరేకల్ మండలం పాలెం గ్రామంలోని శ్రీకూర్మగిరి సుందర లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో మంత్రులు పూజలు నిర్వహించనున్నారు. అనంతరం స్థానిక మినీ స్టేడియంలో 100 మంది లబ్ధిదారులకు మంత్రులు గొర్రెల యూనిట్లు అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తదితరులు హాజరుకానున్నారు.

ముందస్తు సాగయ్యేనా!

- పంటకాలం నెల రోజులు ముందుకు జరపడంపై చర్చ
- బోరుబావుల కింద సాగు తక్కువే..
- ప్రాజెక్టుల ఆధారిత సాగే అధికం
- తర్జనభర్జనలో రైతాంగం



సూర్యాపేట : ముందస్తు సాగు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పంటకాలాన్ని నెల రోజులు ముందుకు జరపాలని రైతులకు సూచిస్తోంది. తద్వారా కొంతవరకైనా ప్రకృతి వైపరీత్యాల బారినపడకుండా అరికట్టవచ్చని భావిస్తోంది. దీనిపై జిల్లావ్యాప్తంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడి వాతావరణ పరిస్థితులు, సాగు నీటి లభ్యత వంటి అంశాల నేపథ్యంలో ముందస్తు సాగు సాధ్యాసాధ్యాలపై కసరత్తు చేస్తున్నారు.

ప్రాజెక్టులే ఆధారంగా వ్యవసాయం

జిల్లాలో నాగార్జున సాగర్ కింద 1,91,539 ఎకరాలు, శ్రీరాంసాగర్ రెండోదశ కింద 2,13,175 ఎకరాలు, మూసీ ప్రాజెక్టు కింద 15,230 ఎకరాలు, సాగర్ ఎత్తిపోతల కింద మరో 38,422 ఎకరాలు, ఐడీసీ ఎత్తిపోతల కింద 54,713 ఇలా మొత్తంగా 5,13,079 సాగు విస్తీర్ణం ఉంటుంది. దీనికి తోడుగా ఆయా చెరువుల కింద మరో 69,385 ఎకరాలు ఉండే అవకాశముంది. ఇందులో సాగర్ ప్రాజెక్టులో నీటి లభ్యత లేనందున ఇప్పట్లో నీటి విడుదల సాధ్యపడేది కాదన్నది అందరికీ తెలిసిందే. ఈ ఆయకట్టుకు ఆగస్టులో గానీ నీటిని అందించే పరిస్థితి లేకపోగా ముందస్తు వ్యవసాయం ఇక్కడ సాధ్యపడదు. ఇక మూసీ ప్రాజెక్టులో పుష్కలంగా నీరుంది. ఈ ప్రాజెక్టు కింద ఉన్న 15వేల ఎకరాలకు ఎలాంటి ఢోకా ఉండదు. ఎస్సారెస్పీ రెండోదశకు నీటి లభ్యత పుష్కలంగా ఉంటుంది. ఎత్తిపోతల ద్వారా మిడ్ మానేరు, లోయర్ మానేరు మీదుగా నీటిని అందించే అవకాశముంది. అయినప్పటికీ ఏటా వానాకాలంలో ఆగస్టు రెండోవారంలో గానీ నీటిని విడుదల చేయడం లేదు. ఈ నేపథ్యంలో ఈ ఆయకట్టుకు కాస్త ముందస్తుగా నీటిని విడుదల చేస్తే దాదాపు 2 లక్షల ఎకరాల్లో ముందస్తుగా నాట్లు పడి పంటల కాలం ముందుకు జరిగే అవకాశముంది.

అవకాశం ఉన్న రైతులు ముందుగానే సాగు చేసుకోవాలి



ప్రకృతి వైపరీత్యాలనుంచి పంటలను కాపాడుకోవడానికి ఒక నెల ముందుకు జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నీటి వనరులు ఉన్న రైతులు ముందుగానే సాగు చేపట్టాలి. ప్రభుత్వ సూచనలను పాటించాలి.

– రామారావు నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ప్రాజెక్టుల నీళ్లు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి

జిల్లాలో 6.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతాయని వ్యవసాయ అధికారుల అంచనా. ఇందులో 1.50 లక్షల ఎకరాల వరకు మెట్ట, ఉద్యాన పంటలు ఉన్నాయి. వర్షాధారంగా సాగు చేసే ఈ మెట్ట పంటలను ముందుకు జరిపే అవకాశాలు లేకపోగా.. ఈ పంటల సాగు నాలుగైదు ఏళ్లుగా క్రమంగా తగ్గుతూ వస్తోంది. అయితే జిల్లాలో అత్యధికంగా ప్రాజెక్టులపై ఆధారపడే వరి సాగు కావడం.. ఈ ప్రాజెక్టుల నీళ్లు ఎప్పుడొస్తాయో తెలియని క్రమంలో పంటల సాగును ముందుకు జరపడం ఎలా అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బోరు బావుల కింద సాగయ్యే ఈ వరి చాలా తక్కువ విస్తీర్ణంలోనే ఉంటుంది.

నిర్వాసితులకు భరోసా

- 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయం చేస్తాం
- సీఎల్పీ నేత భట్టివిక్రమార్క
- నల్లగొండ జిల్లాలోకి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర
- నక్కల గండి ప్రాజెక్టును పరిశీలించిన భట్టి
- పదేళ్లు అవుతున్నా ఎస్‌ఎల్‌బీసీని పూర్తిచేయలేదని ధ్వజం

చందంపేట: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 84వ రోజు నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలంలో కొనసాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం మన్నెవారిపల్లి గ్రామం నుంచి చందంపేట మండలం నక్కలగండి తండాలోకి బుధవారం రాత్రి సీఎల్పీ విక్రమార్క పాదయాత్ర అడుగు పెట్టింది. రాత్రి ప్రాజెక్టుపైనే బస చేసిన భట్టి విక్రమార్క.. గురువారం ఉదయం నల్లగొండ జిల్లా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నక్కలగండి ప్రాజెక్టును పరిశీలించారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ప్రాజెక్టుపై నడిచి జరిగిన పనులను చూశారు. ఆ తర్వాత ప్రాజెక్టు కింద టెంటు వేసుకొని నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నక్కలగండి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న నక్కలగండి తండా, మర్లపాడు తండా, కేశ్య తండా నిర్వాసితులు వారికి జరుగుతున్న అన్యాయం గురించి మొరపెట్టుకున్నారు. 3,800 ఎకరాల భూమిని ముంపునకు గురిచేస్తూ కడుతున్న నక్కలగండి ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాలువలు తీయకపోవడం వల్ల దిగువన ఉన్న ఆయకట్టుకు నీళ్లు అందని పరిస్థితి ఉందని రైతు భరత్ కుమార్ చెప్పారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి ఇచ్చిన మూడు, నాలుగు లక్షల రూపాయలతో ఎక్కడా భూములు దొరక్కపోవడంతో పట్టణాలకు వెళ్లి ఆటో నడుపుతూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెల్దేవర్‌పల్లి గ్రామానికి చెందిన నిర్వాసితుడు పచ్చిపాల ఇద్దయ్య మాట్లాడుతూ 'నాగార్జున సాగర్‌లో ముంపునకు గురైన మమ్మల్ని ఇక్కడికి తీసుకువచ్చి పునరావాస గ్రామంగా ఏర్పాటు చేశారు. మళ్లీ నక్కలగండి ప్రాజెక్టుతో మరోసారి మా ఊరంతా మునిగిపోతున్నది. 48 కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న హామీ అమలు చేయాలని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అడగ్గా భూసేకరణ చేసే డిప్యూటీ కలెక్టర్ ఉపాధి హామీ పథకం కింద ఇచ్చే కూలి పని ఇంటికో ఉద్యోగం ఇచ్చినట్టు కాదా! అని దబాయించారు..' అని చెప్పారు. నిర్వాసితులు సమస్యలను విన్న తర్వాత భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. చందంపేట మండలంలోని 15 గ్రామాల ప్రజలు దేవరకొండ పట్టణానికి రాకపోకలు సాగించే ఆర్ అండ్ బీ రోడ్డు డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్నందున ప్రాజెక్టు పక్కన ఉన్న గుట్ట నుంచి నూతన రోడ్డు వేయించాలని ఎంపీపీ నున్సావత్ పార్వతి చందునాయక్ వినతి పత్రం అందజేశారు.



భట్టితో కలిసి పాదయాత్రలో పాల్గొన్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రాజెక్టులను విస్మరించిన బీఆర్‌ఎస్ - ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

భట్టివిక్రమార్క పాదయాత్రకు నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టును పూర్తి చేస్తామని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం దానిని విస్మరించిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో కలెక్టర్లు, ఎస్పీలు గులాబీ చొక్క వేసుకోవడమే తక్కువని, పార్టీకి తొత్తులుగా మారారని పేర్కొన్నారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని శాసన సభలో తీర్మానం చేసి తొమ్మిది సంవత్సరాలుగా కేంద్రానికి ఎందుకు పంపడం లేదని ఆయన ప్రశ్నించారు. మండుటెండలో దాదాపు వెయ్యి కిలోమీటర్లు పాదయాత్ర చేసిన భట్టి విక్రమార్కకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మల్లురవి, మాజీ ఎమ్మెల్యే బాలునాయక్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు బిల్యానాయక్, జాల నర్సింహారెడ్డి, సిరాజ్ ఖాన్, జగన్‌లాల్, రవినాయక్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు నెలల్లో అధికారంలోకి కాంగ్రెస్

'ఐదు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. సీఎం కేసీఆర్, మంత్రులు హరీష్, కేటీఆర్ వారి తాత, ముత్తాతలు వచ్చినా కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా అడ్డుకోలేరు' అని భట్టి విక్రమార్క అన్నారు. నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పదేళ్లు అవుతున్నా పూర్తి చేయకుండా సిగ్గులేని ఈ ప్రభుత్వం నీటిపారుదల వారోత్సవాలు చేస్తుందన్నారు. ఎస్ఎల్బీసీ నుంచి నీళ్లు తెచ్చుకుందామన్న సోయిలేని జిల్లా మంత్రి జగదీశరెడ్డి జిలాకు దిష్టిబొమ్మలాగా ఉన్నారన్నారు. తెలంగాణ వచ్చి పదేళ్లు అవుతున్నా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఎందుకు ఆలస్యం అవుతుందని ఒక్క రోజైనా సమీక్ష చేశారా? అని ప్రశ్నించారు. ప్రగతి భవన్‌కు వెళ్లి సీఎంకి భజన చేసే మంత్రి నల్లగొండ జిల్లా ప్రజలకు అవసరమా? ఆలోచన చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును పూర్తి చేయడానికి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయిస్తే నాలుగు లక్షల ఎకరాలకు నీళ్లు పారేవన్నారు. పార్లమెంట్ మెంబర్‌గా, ఎమ్మెల్సీగా, మండలి చైర్మన్‌గా నల్లగొండకు ఏం తెచ్చావని గుత్తా సుఖేందర్‌రెడ్డిని భట్టివిక్రమార్క ప్రశ్నించారు.



సభలో మాట్లాడుతున్న సీఎల్పీనేత భట్టి విక్రమార్క, చిత్రంలో మల్లు రవి, బాలునాయక్ తదితరులు

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్ : యూపీఎస్‌సీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు 2024 సంవత్సరానికి గాను హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ కోసం జిల్లా నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.దయానందరాణి, సూర్యాపేట స్టడీ సర్కిల్ డైరెక్టర్ సీహెచ్.రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ కలిగి, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లక్షల కంటే తక్కువ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. జూలై 2వ తేదీ వరకు www.tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రవేశ పరీక్ష హైదరాబాద్‌లో జూలై 9న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 040 -23546552, 9989129935 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని పబ్లిక్ క్లబ్ గార్డెన్ లో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ గురువారం ప్రారంభమైంది. స్టాళ్లను కలెక్టర్ వెంకట్రావు, జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ తో కలిసి పరిశీలించారు. నోరూరించే చేపల వంటలను వారు రుచి చూశారు. విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ పరిశీలించారు. కలెక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్ ఈనెల 10వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి రూపేందర్ సింగ్, సాయిబాబా ,అధికారులు పాల్గొన్నారు



ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో ఆహార పదార్థాలను రుచి చూస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

నీటిపారుదల రంగంలోనూ అద్భుత విజయాలు



చెరువుల పండుగ సందర్భంగా పిల్లలమర్రిలోని సుబ్బ సముద్రం కట్టపై భోజనాలు చేస్తున్న ప్రజలు

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి
- పిల్లలమర్రి సుబ్బ సముద్రం చెరువుకు పూజలు
- అట్టహాసంగా చెరువుల పండుగ

సూర్యాపేట రూరల్ : నీటి పారుదల రంగంలోనూ తెలంగాణ రాష్ట్రం అద్భుత విజయాలు నమోదు చేసుకుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామంలోని సుబ్బ సముద్రం చెరువు కట్టపై నిర్వహించిన చెరువుల పండుగకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా చెరువులో పూలు చల్లి, హారతి ఇచ్చి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్ణీత వ్యవధిలో ప్రాజెక్టులు నిర్మించి జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన చరిత్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కిందన్నారు. 2014కు ముందు ఏనాడూ మూసీ నీటితో రెండు పంటలు పండించిన చరిత్ర లేదన్నారు. అధికారంలోకి వచ్చిన మరుసటి సంవత్సరానికే రూ.20 కోట్లతో మూసీ ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించడం ద్వారా వరుసగా16 పంటలకు సమృద్ధిగా నీరు అంది రికార్డు స్థాయిలో పంటలు పండించుకున్నామన్నారు. చేపల పెంపకంలోనూ తెలంగాణ రికార్డ్ సృష్టించిందన్నారు. పోరాడి సాధించికున్న ప్రత్యేక రాష్ట్రంలో వ్యవసాయం, విద్యుత్, నీటి పారుదల, విద్య, వైద్యం, ఫ్రెండ్లీ పోలీసింగ్, తదితర రంగాల్లో తొమ్మిదేళ్లలో సాధించిన విజయాలను మననం చేసుకునేందుకే దశాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్నామన్నారు. అటువంటి అద్భుతమైన విజయాలు అందించిన సీఎం కేసీఆర్‌కు ఈ నేల ఎప్పటికీ రుణపడి ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.



సుబ్బ సముద్రం చెరువు వద్ద హారతి ఇస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సుబ్బ సముద్రం చెరువుపై మినీట్యాంక్ బండ్ నిర్మాణం

పిల్లలమర్రిలోని సుబ్బ సముద్రం చెరువుపై మినీ ట్యాంక్ బండ్ నిర్మిస్తామని మంత్రి వెల్లడించారు. రెండేళ్ల వ్యవధిలో సుబ్బ సముద్రం నీరు తాగడానికి వినియోగించేలా తీర్చి దిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్ రెడ్డి, జెడ్పీటీసీ జీడీ భిక్షం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ , నీటి పారుదల అధికారి రమేష్ బాబు, డీఈ భద్రు నాయక్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, కౌన్సిలర్‌లు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, బచ్చలకూర శ్రీనివాస్, తాహేర్, అభినయ్, భారత్, రాజేందర్, నాయకులు రాపర్తి సైదులు, మహేష్, వెంకన్న, రాములు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

కల్నల్ సంతోష్‌బాబు విగ్రహావిష్కరణ



కోదాడ పట్టణంలోని ప్రధాన రహదారిపై వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కల్నల్ సంతోష్‌బాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు తదితరులు

పాఠశాల తొలి రోజే పుస్తకాల పంపిణీ

- ఇప్పటి వరకు జిల్లాకు వచ్చిన పుస్తకాలు 3.60లక్షలు
- మండలాలకు తరలించే ప్రక్రియ పూర్తి
- స్కూళ్లు తెరిచేనాటికి మిగతావి కూడా..



జిల్లా కేంద్రంలోని గోదాముకు వచ్చిన పుస్తకాలు

చిలుకూరు: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందక విద్యా బోధనపై ప్రభావం చూపేది. విడతల వారీగా పంపిణీ చేయడంతో ఇద్దరు ముగ్గురు విద్యార్థులు కలిసి చదువుకునే వారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాఠశాల ప్రారంభం రోజే పుస్తకాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర విద్యాశాఖ నుంచి జిల్లా కేంద్రాలకు కార్గో బస్సుల ద్వారా పుస్తకాలు సరఫరా చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని గోదాములో వాటిని నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి మండలాలకు తరలిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 941, కేజీబీవీలు 18, ఆదర్శ పాఠశాలలు 9 ఇలా మొత్తం 968 పాఠశాలలు ఉన్నాయి. ఈ స్కూళ్లలో 63,805 మంది విద్యార్థులు ఉండగా వీరికోసం 5,79,090 పుస్తకాలు అవసరం. అయితే ఇప్పటి వరకు 3,60,000 పుస్తకాలు వచ్చాయి. వీటిని మండలాలకు తరలించారు. మిగతా పుస్తకాలన్నీ స్కూళ్లు తెరిచేనాటికి తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మొత్తం పాఠశాలలు	968
విద్యార్థుల సంఖ్య	63,805
అవసరమైన పుస్తకాలు	5,79,090
వచ్చిన పుస్తకాలు	3. 60 లక్షలు

ఇంగ్లిష్ మీడియంతో గతేడాది ఇబ్బందులు

2022–23 విద్యాసంవత్సరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రారంభించారు. పుస్తకాలు ముద్రించడం, అవి సరఫరా చేయడం ఆలస్యం కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. దీనికి తోడు 2020 నుంచి కోవిడ్ ప్రభావంతో పూర్తి స్థాయిలో పుస్తకాలు ఇవ్వలేదు. గతేడాది నవంబర్ వరకు పుస్తకాల పంపిణీ కొనసాగింది. ఈ సారి విద్యాశాఖ అధికారులు ముందుగానే మేల్కొన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే పుస్తకాలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పుస్తకాలన్నీ తెప్పిస్తాం



ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు పుస్తకాల విషయంలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. తరగతుల ప్రారంభించిన రోజునే పుస్తకాలు అందజేస్తాం. జూన్ 12 నస్కూళ్లు తెరిచే నాటికి పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు తెప్పించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్ని పుస్తకాలు వచ్చాయి.

– అశోక్, జిల్లా విద్యాధికారి, సూర్యాపేట జిల్లా

పక్కదారి పట్టకుండా..

ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. కింద స్థాయి సిబ్బంది కొందరు బహిరంగ మార్కెట్‌కు తరలించి , విక్రయించి సొమ్ము చేసుకోకుండా ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రతి పుస్తకానికి వరుస సంఖ్య, క్యూ ఆర్ కోడ్ వేస్తున్నారు. జిల్లాలోని ఆయా పాఠశాలలకు సరఫరా చేసే పుస్తకాల వివరాలను డీఈఓ కార్యాలయంలో ప్రత్యేక రిజిస్టర్లు ఏర్పాటు చేసి నమోదు చేస్తున్నారు. ఏ రోజు ఎన్ని పుస్తకాలు వచ్చాయో పొందుపరుస్తున్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతి


మృతిచెందిన గేదెలు

మునగాల: మండలంలోని ముకుందాపురం శివారులో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిపై గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన గేదెలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉండడంతో కోదాడ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న బొలేరో వాహనం గేదెలను ఢీకొట్టి డివైడర్ పైకి ఎక్కి ఆగిపోయింది.

దాడి కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

తుంగతుర్తి: తమ్ముడిపై దాడి చేసిన కేసులో అన్నకు 15నెలల జైలుశిక్షతో పాటు రూ.6వేలు జరిమానా విధిస్తూ తుంగతుర్తి జూనియర్ సివిల్ జడ్జి రాచర్ల షాలిని గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు.. తిరుమలగిరి మండలం అనంతారం గ్రామానికి చెందిన వజ్జె లింగయ్య 2015 సెప్టెంబర్‌లో భూమి తగాదా విషయంలో తన తమ్ముడైన వజ్జె పరమేష్‌పై గొడ్డలితో దాడి చేశాడు. పరమేష్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ రాజు లింగయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా గురువారం తుంగతుర్తి కోర్టులో ఈ కేసు విచారణకు రాగా నిందితుడు వజ్జె లింగయ్యకు 15నెలల జైలుశిక్షతో పాటు రూ.6వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చండూరు : తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 5వ వార్డుకు చెందిన గీత కార్మికుడు పనస యాదయ్య తన వృత్తిలో భాగంగా గురువారం ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జనంపల్లిలో ఈదురు గాలుల బీభత్సం


ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం

రామన్నపేట: మండలంలోని జనంపల్లిలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. చెట్ల కొమ్మలు విరిగిపడి ఇళ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు కూలి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కూలిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సర్పంచ్ రేఖ యాదయ్య అధికారులను కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- ఒక కారును, రెండు లారీలను ఢీకొన్న కారు
- మృతులు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ వాసులు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారు హైదరాబాద్ నగర వాసులుగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌కు చెందిన చెందిన ఎండి.నయీం తన స్నేహితులు సయ్యద్ మిస్బావుద్దీన్, మహ్మద్ యూసుఫ్, ఎండి.సలీంతో కలిసి కారు(ఏపీ 09 బీహెచ్5443)లో సూర్యాపేటకు బుధవారం వెళ్లారు. రాత్రి తిరిగి సనత్‌నగర్‌కు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు రాత్రి పదిన్నర గంటల తరువాత పెద్దకాపర్తి శివారులో ముందు వెళుతున్న కారు(ఏపీ 27 ఏటీ 2277)ను ఎడమవైపు నుంచి ఓవర్‌టేక్ చేయబోయి ముందున్న కారును


నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలు

ఢీకొట్టింది. దీంతో ముందున్న కారు డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోగా.. వీరు ప్రయాణిస్తున్న కారు కుడి వైపు డివైడర్‌ను ఢీకొట్టి గాల్లోకి లేచి.. విజయవాడ వైపు వెళ్తున్న రెండు లారీలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సయ్యద్ మిస్బావుద్దీన్(50) అక్కడికక్కడే మృతిచెందాడు. యూసుఫ్(47), డ్రైవింగ్ చేస్తున్న నయీం(40)తో పాటు ఎండీ సలీంకు తీవ్ర గాయాలుకాగా నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ యూసుఫ్, నయీం మృతిచెందారు. సలీంను మెరుగైన చికిత్సకుగాను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తర


నల్లగొండలో ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

లించారు. రెండు లారీల డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాలను నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, సీఐ శివరాంరెడ్డి పరిశీలించారు. మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుల బంధువు మహ్మద్ రఫీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఏసీబీ వలలో విద్యుత్ శాఖ అధికారులు

- లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్ ఇంజినీర్

నల్లగొండ: ఓ కాంట్రాక్టర్‌కు పనుల అగ్రిమెంట్ చేసేందుకు రూ.10 వేలు లంచం తీసుకున్న విద్యుత్ శాఖ ఏడీఈ (ఇన్‌చార్జి డీఈఈ), సబ్ ఇంజినీర్‌ను గురువారం నల్లగొండలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మునుగోడు సబ్ డివిజన్ ఏడీఈ (ఆపరేషన్స్ ఇన్‌చార్జి డీఈఈ) సీహెచ్ శంకరయ్య, సబ్ ఇంజినీర్ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డిలను అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని, శుక్రవారం వారిని ఏసీబీ కోర్టులో హాజరుపర్చుతామని వెల్లడించారు. ఏసీబీ డీఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండలం చిన్నతుమ్మలగూడెం గ్రామానికి చెందిన పడమటి నర్సిరెడ్డి అనే కాంట్రాక్టర్ మండలంలో విద్యుత్ పనులు చేసేందుకు రెండు నెలల కింద 20 పనులను పొందాడు. వాటి ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంది. విద్యుత్ శాఖ అధికారులైన ఇన్‌చార్జి డీఈఈ, సబ్ ఇంజనీర్ వాటిపై సంతకం చేసేందుకు లంచం డిమాండ్ చేశారు. ఒక్కో అగ్రిమెంట్‌కు రూ.500 చొప్పున 20 అగ్రిమెంట్లకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సబ్ ఇంజనీర్ వెంకట్‌రెడ్డి కూడా ఇదే విషయాన్ని చెప్పాడు. ఆయన ద్వారానే శంకరయ్య లంచం తీసుకునేందుకు అంగీకరించారు. దీంతో కాంట్రాక్టర్ నర్సిరెడ్డి నల్లగొండ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.


ఏసీబీ రైడ్‌లో పట్టుకున్న కరెన్సీ

గురువారం నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లో ఉన్న విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయానికి నర్సిరెడ్డితో కలిసి ఏసీబీ అధికారులు వచ్చారు. రూ.10 వేలు లంచాన్ని సబ్ ఇంజనీర్ వెంకట్‌రెడ్డి తన ఎడమ చేతితో ప్యాంటు వెనుక జేబులో పెట్టుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ కృష్ణ గౌడ్ నేతృత్వంలో ఏసీబీ బృందం పట్టుకుంది. జరిగిన విషయాన్ని వెంకట్‌రెడ్డి చెప్పడంతో వెంటనే ఇన్‌చార్జి డీఈఈ శంకరయ్య చాంబర్‌కు వెళ్లారు. అక్కడ ఆయన ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో చర్చిస్తున్నారు. వెంటనే అక్కడ ఉన్న వారందరి ఫోన్లు తీసుకుని, ఉద్యోగ సంఘం నాయకులను బయటికి పంపించారు. శంకరయ్యను విచారించారు. ఆయన ప్రోద్బలంతోనే సబ్‌ఇంజనీర్ లంచం తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో ఇన్‌చార్జి డీఈఈ, సబ్ ఇంజనీర్‌ను అరెస్టు చేశారు.

చెరువులో జారి పడి బాలుడు మృతి

చివ్వెంల(సూర్యాపేట): ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి బాలుడు మృతిచెందిన ఘటన చివ్వెంల మండల పరిధిలోని మోదిన్‌పురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోదిన్‌పురం గ్రామానికి చెందిన వంగూరి భిక్షం, లక్ష్మి దంపతుల కుమారుడు వంగూరి శివగణేష్(10) స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదుతున్నాడు. సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉంటున్న శివగణేష్ గురువారం తన స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని చెరువు వద్దకు మలవిసర్జనకు వెళ్లాడు. మలవిసర్జన అనంతరం చెరువు ఒడ్డుకు వెళ్లిన శివగణేష్ ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడ్డాడు. గమనించిన తోటి స్నేహితులు కేకలు వేయడంతో అక్కడే ఉపాధి పనులు చేస్తున్న కూలీలు వచ్చి శివగణేష్‌ను బయటకు


శివగణేష్ మృతదేహం

తీసి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కాగా శివగణేష్ తండ్రి కొద్ది సంవత్సరాల క్రితమే మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు.

భూ వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు

హుజూర్‌నగర్: అధికారులు భూమి సర్వే చేస్తుండగా రెండు వర్గాలు ఘర్షణ పడగా, ఇరువర్గాలపై గురువారం పోలీసులు కేసులు నమోదు చేశారు. హుజూర్‌నగర్ ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణ శివారులోని బైపాస్ వద్ద రామలక్ష్మీపురం రోడ్డులో సర్వే నంబర్ 502లో ఉన్న భూమిని హైకోర్టు ఉత్తర్వుల మేరకు హద్దులు నిర్ణయించేందుకు గురువారం సర్వే అధికారులు వెళ్లారు. ధరణి వెబ్‌సైట్‌లో భువనగిరి నీలిమ పేరు మీద ఉన్న సదరు భూమికి హద్దులు నిర్ణయించేందుకు సర్వే అధికారులు చుట్టుపక్కల రైతులతో మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో భువనగిరి నీలిమ, పి. చంటి, సతీష్‌తో పాటు మరికొంత మంది ఒక వర్గంగా ఏర్పడగా.. డి. చైతన్య, ఎం. కవిత, పి. పద్మ, ఎం. వెంకటేశ్వర్లు మరికొంత మంది రైతులు మరో వర్గంగా ఏర్పడి ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

పెద్దవూర: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులు, బాలుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాగార్జునసాగర్ సీఐ భీషన్న తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం పెద్దవూర పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్‌తో కలిసి సీఐ విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా కారంపూడికి చెందిన అంగడి కోటేశ్వరరావు, నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం దోడబాయితండాకు చెందిన కేతావత్ లచ్చుతో పాటు మరో బాలుడు కలిసి గత కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. గురువారం పెద్దవూర మండలంలోని తుమ్మచెట్టు గ్రామ స్టేజీ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో వీరు ముగ్గురు బైక్‌పై అటుగా వస్తూ పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా.. గత నెల 30వ తేదీన పెద్దవూర మండలం కోమటికుంటతండాలోని తుల్జాభవాని దేవాలయంలో మైక్‌సెట్‌కు


వివరాలు వెల్లడిస్తున్న నాగార్జునసాగర్ సీఐ భీషన్న

సంబంధించిన రెండు యాంప్లిఫయర్‌లు, ఈ నెల 2న రామన్నగూడెం తండా సమీపంలోని ముత్యాలమ్మ గుడి పక్కన ఉన్న కిరాణ దుకాణంలో రెండు సెల్‌ఫోన్‌లను దొంగిలించినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుంచి బైక్, రెండు యాంప్లిఫయర్‌లు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

పట్టపగలు ఇంట్లో భారీ చోరీ

- అర కేజీకి పైగా బంగారు ఆభరణాలు, రూ.8లక్షల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు
- సీసీ కెమెరాలు సైతం అపహరణ
- చిట్యాల పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి వెంచర్‌లో సంఘటన

చిట్యాల: పట్టణంలో గురువారం పట్టపగలు ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లోకి చొరబడి అర కేజీకి పైగా బంగారు ఆభరణాలు, రూ.8లక్షల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని హైవే రోడ్డుకు అనుకొని ఉన్న శ్రీవేణుగోపాలస్వామి వెంచర్‌లో నివాసముండే గంజి రాంమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం కోదాడలోని తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో ఆయన తిరిగి ఇంటికి రాగా, ఇంటి తాళం పగు


వివరాలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

లగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన అర కేజీకి పైగా బంగారు ఆభరణాలతో పాటు రూ.8 లక్షల నగదు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, కెమెరాల ఆపరేటింగ్ సిస్టంను సైతం దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు చిట్యాల పోలీసులకు సమాచారం అందించగా.. నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, సీఐ శివరాంరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు.

గోదావరి జలాల నిలిపివేత

అర్వపల్లి: ఎస్సారెస్పీ రెండో దశ 71డీబీఎం కాల్వకు గోదావరి జలాలను గురువారం నిలిపివేశారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి దినోత్సవం కోసం ఈనెల 4న ఎస్సారెస్పీ రెండో దశ 71డీబీఎం కాల్వకు నీటిని విడుదల చేశారు. బుధవారం నాగారం మండలం ఈటూరు నుంచి సూర్యాపేట నియోజకవర్గంలోని పెన్‌పహాడ్ మండలం వరకు 71 డీబీఎం కాల్వ పొడవుగా లక్ష జనహారతి నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం పూర్తి కావడంతో నీటి విడుదలను నిలిపివేశారు. తిరిగి గోదావరి జలాలను వానాకాలం సీజన్‌కు వదలనున్నట్లు బయ్యన్నవాగు డీఈఈ ఎం.సత్యనారాయణ తెలిపారు.


71డీబీఎం కాలువ

చెరువుల్లో నీళ్లుంటేనే బతుకులు బాగు

- నల్లగొండ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిడమనూరు : చెరువుల్లో నీళ్లుంటే అందరి బతుకులు బాగుపడతాయి అని నల్లగొండ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి నిడమనూరులో అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమంలో మండల కేంద్రంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నిడమనూరులో కలెక్టర్‌కు బోనాలు, వలలతో మహిళలు స్వాగతం పలికారు. మండల కేంద్రమైన నిడమనూరు నల్లచౌట చెర్వు వద్ద కట్ట మైసమ్మకు పూజలు చేసి పండుగ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీపీ జయమ్మ, సర్పంచ్ మేరెడ్డి పుష్పలత, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, తహసీల్దార్ ప్రమీళ, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, ఎంపీటీసీ రాణిరమేష్, మత్స్య సొసైటీ చైర్మన్ కోట్ల సైదయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

పాలెం, చింతగూడెం గ్రామాల్లో కలెక్టర్

హాలియా : అనుముల మండలంలోని పాలెం, చింతగూడెం గ్రామాలను కలెక్టర్ సందర్శించారు. మహిళలు కోలాటాలతో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి స్వాగతం పలికారు. చింతగూడెంలోని బొడ్రాయి వద్ద కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టారు. మహిళల బతుకమ్మలు పేర్చి ఆడిపాడగా కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంగ, ఎంపీడీఓ లక్ష్మి, ఏపీఎం కళావతి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు మజ్జిగపు వెంకట్రాంరెడ్డి, లక్ష్మి శ్రీనివాస్, లింగమ్మ, నాయకులు తదితరులు ఉన్నారు.


హాలియా: చింతగూడెంలో బొడ్రాయి వద్ద కొబ్బరికాయ కొడుతున్న కలెక్టర్


గోడ కూలి వ్యక్తి దుర్మరణం

చివ్వెంల: గోడ కూలి వ్యక్తి మృతిచెందిన సంఘటన చివ్వెంల మండల పరిధి లోని దురాజ్‌పల్లి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం మహ్మదాపురం గ్రామానికి కుంచం ముత్తయ్య (32), కుంచం శంకరయ్య దురాజ్‌పల్లి గ్రామ శివారులోని నవరత్న పార్‌బాయిల్డ్ మిల్లులో పాత గోడ కూల్చివేయడానికి కూలి పనికి వెళ్లారు. గోడ కూలుస్తుండగా ఒక్కసారిగా మీద పడటంతో


కుంచం ముత్తయ్య (ఫైల్)

ముత్తయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. శంకరయ్య కాలు విరిగింది. విషయం బయటకు పొక్కకుండా మిల్లు యాజమాన్యం మృతుడి కుటుంబ సభ్యులతో బేరసారాలు ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. దీనిపై స్థానిక ఎస్‌ఐ విష్ణుమూర్తిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు


సుదర్శన హోమం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం నిత్యకైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ప్రధానాలయం ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తర పూజలు గావించారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

మత్స్యకారులకు సర్కారు చేయూత

- ఫిషరీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ పిట్టల రవీందర్

భువనగిరిటౌన్ : మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని, జలాశయాల్లో చేప పిల్లలను వదలడంతో పాటు రాయితీపై వాహనాలు, వలలు పంపిణీ చేస్తుందని ఫిషరీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలతో మత్స్య రంగం నేడు ఎంతో పురోగతి సాధించిందన్నారు. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీటి వనరుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి


ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో చేపల బిర్యానీని పరిశీలిస్తున్న పిట్టల రవీందర్, యాదాద్రి జెడ్పీ చైర్మన్, కలెక్టర్

చేశారని పేర్కొన్నారు. తద్వారా మత్స్య సంపద గణనీయంగా పెరిగిందన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మత్స్యకారులు ప్రభుత్వం అందజేసే వాహనాలు, వలలు, ఇతర రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని వృత్తిలో రాణించాలని కోరారు. అనంతరం చేపల స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా రైతుబంధు కో ఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ట్రాక్టర్ ఢీ.. వ్యక్తి మృతి

డిండి: ఎదురెదురుగా ఆటో, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి డిండి మండలంలోని దాసరినెమలిపూర్‌తండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దాసరినెమలిపూర్ తండాకు చెందిన వద్య పాండు(48) కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం దాసరినెమలిపూర్


వద్య పాండు (ఫైల్)

తండాలోని ఎర్రకుంట చెరువు వద్ద రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమానికి పాండు పలువురు గ్రామస్తులతో కలిసి పాల్గొని ఆటోలో తిరిగి గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్, ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పాండుకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. శాంతి, మంగ్లీ, చారోడి, లచ్చిరాంకు గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కాగా ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

పశువుల కొట్టం కూలిపోయి ఆవు మృతి

నాంపల్లి: ఈదురుగాలులకు పశువుల కొట్టం కూలిపోయి ఆవు మృతిచెందిన సంఘటన గురువారం సాయంత్రం నాంపల్లి మండలంలోని బొజగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. నాంపల్లి మండల కేంద్రానికి చెందిన బొడ్డుపల్లి కృష్ణయ్య గురువారం బొజగూడెం గ్రామంలో గల తన వ్యవసాయం బావి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో తన పశువుల కొట్టంలోకి వెళ్లాడు. భారీ గాలులకు పశువుల కొట్టం ఒక్కసారిగా కూలిపోగా అందులోని ఆవు మృతిచెందింది, కృష్ణయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతిచెందిన ఆవు విలువ రూ.60వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

10న నల్లగొండకు కేంద్ర మంత్రి రాక

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ మహేంద్రనాథ్ ఈనెల 10వ తేదీన నల్లగొండకు రానున్నట్లు బీజేపీ నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్ తెలిపారు. గురువారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 10న ఉదయం 11 గంటలకు కేంద్ర మంత్రి పానగల్‌లోని శ్రీ ఛాయా సోమేశ్వరాలయాన్ని దర్శించుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు మీడియా సమావేశం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు మనోరమ హోటల్‌లో సోషల్ మీడియాను ప్రభావితం చేసే వ్యక్తులతో సమావేశం, 3.30 గంటలకు నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని అనుముల మండలం 14 మైలు వద్ద కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జిని సందర్శిస్తారని తెలిపారు.

10న యాదాద్రిలో సామూహిక అక్షరాభ్యాసం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 10వ తేదీన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించనున్నట్లు ఈఓ గీతారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండ దిగువన ఉన్న సత్యనారాయణస్వామి వ్రత మండపం రెండవ హాల్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సుమారు 100 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తామని వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లల వివరాలను శుక్రవారం నమోదు చేసుకోవాలని సూచించారు. 10వ తేదీ ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ తెలిపారు.

రైతుల సంక్షేమానికి సీఎం కృషి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనేక ప్రాజెక్టులు నిర్మించి రైతుల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం దామరచర్ల మండల కేంద్రంలోని నాగులచెరువు వద్ద నిర్వహిస్తున్న ఊరూర చెరువుల పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్ల మోతు భాస్కర్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెరువులో బతుకమ్మలను వదిలారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో కుంటుపడిన చెరువులను సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ ద్వారా పూడికతీయించి పూర్వవైభవం తీసుకొచ్చారని చెప్పారు. మత్స్యకారుల అభివృద్ధికి పలు పథకాలను ప్రవేశపెట్టారని.. వాటిని సద్వినియోగం


దామరచర్లలోని నాగుల చెరువులో బతుకమ్మను వదులుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా నాయకుడు కుందూరు వీరకోటిరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పడిగపాటి కోటిరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు ఎండీ.యూసుఫ్, అంగోతు హాతీరాంనాయక్, దారగాని వెంకటేశ్వర్లు గౌడ్, ఎంపీటీసీలు సోము సైదిరెడ్డి, బాల లక్ష్మీసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.